సాక్షి
తిరుపతి
శనివారం । 30 । డిసెంబర్ । 2023



తగ్గిన నేరాలు..

గత ఏడాదికంటే ఈ సారి నేరాలు తగ్గుముఖం పట్టాయని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. - 8లో



కొనసాగుతున్న వలసలు

చంద్రగిరి నియోజకవర్గంలో పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. - 8లో



రోల్‌బాల్ పోటీలు ప్రారంభం

తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

ముక్కంటి సేవలో కేంద్ర మంత్రి



రాహుకేతు పూజల్లో కేంద్రమంత్రి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ కుటుంబ సమేతంగా విచ్చేసి దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు సహస్ర లింగం వద్ద ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం అందించగా.. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను ఆలయ అధికారులు అందించారు.

ఎర్రచందనం అక్రమరవాణాపై ఉక్కుపాదం



టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

తిరుపతి మంగళం: ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు (ఆర్ఎస్ఎఎస్టీఎఫ్) ఎస్పీగా పీ.శ్రీనివాస్ శుక్రవారం కపిలతీర్థం సమీపంలోని టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకినాడ అదనపు ఎస్పీగా పనిచేస్తూ టాస్క్ ఫోర్సు ఎస్పీగా పదోన్నతిపై విచ్చేశారు. ఎస్పీ మాట్లాడుతూ శేషాచలం అడవుల్లోని ఎర్రచందనం సంపదను స్మగ్లర్లు కొల్లగొట్టకుండా ఉండేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కూంబింగ్ ఆపరేషన్లు పెంచి, సాంకేతికతను ఉపయోగించుకుంటామని తెలిపారు. ఇంటర్ స్టేట్ ఆపరేషన్లు, ఇతర శాఖల సహకారంతో సమర్థవంతంగా విధులు చేపడుతామన్నారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీకి డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు, రిజర్వు ఆర్ఐ సురేష్ కుమార్‌రెడ్డి, సీఐలు శ్రీనివాసులు, సురేష్‌కుమార్, ఎసీఎఫ్ జే.శ్రీనివాస్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

ఫిర్యాదులు పరిష్కరించండి

తిరుపతి అర్బన్: రాజకీయ పార్టీల నేతల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా సూచించారు. శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, జేసీలు, ఈఆర్‌వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, జేసీ శుభం భన్సల్, ఈఆర్‌వోలు హాజరయ్యారు. అంతకుముందు కలెక్టర్ జిల్లా పరిస్థితులను తెలియజేశారు. అనంతరం ఆయన పెండింగ్‌లోని దరఖాస్తుల పరిష్కారం, ముసాయిదా జాబితాకు ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, పెండింగ్ ఉన్న రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఎపిక్ కార్డుల జనరేషన్, పంపిణీ తదితర అంశాలను వివరించారు. కాన్ఫరెన్స్‌లో తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీఓలు నిశాంత్ రెడ్డి, శివశంకర్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఎన్నికల విభాగ అధికారులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్

తిరుపతి అర్బన్: ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో శుక్రవారం సంబంధిత అధికారులతో రోడ్డు భద్రతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. తిరుపతి జిల్లాలో గతంలో జరిగిన రోడ్డు ప్రమాదలపై చర్చించారు. పోలీసులతో పాటు ఆర్డీవో, ఆర్టీసీ, ఆర్అండ్‌బీ అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా రవాణాశాఖ అధికారి కె.సీతారామిరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ బీ.నరసప్ప, రవాణాశాఖ అధికారి ఆదినారాయణ, నేషనల్ హైవే పీడీ వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ జిల్లా అధికారి సుధాకర్‌రెడ్డి, ఆర్టీసీ డెప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నవశకం



నాడు: గతంలో అసౌకర్యాలకు నిలయంగా చిట్టత్తూరు పాఠశాల



నేడు: నాడు-నేడుతో సర్వాంగ సుందరంగా ముస్తాబైన రామచంద్రాపురం మండలం చిట్టత్తూరు పాఠశాల

మేనమామ పెట్టుబడి!

'పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి ఏదైనా ఉందంటే అది విద్య ఒక్కటే. పేదరికంతో ఏ ఒక్కరూ చదువుకు దూరం కారాదు. చదువు కోసం మనం పెట్టే పెట్టుబడి వారి ఉజ్వల భవితకు నాంది పలుకుతుంది. అందుకే మీ పిల్లలను బడికి పంపండి. మీ సోదరుడిగా.. పిల్లల మేనమామగా నేను చదివిస్తా..'నంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లిదండ్రులను ప్రోత్సహిస్తున్నారు. ప్రతిఒక్కరూ ఉన్నత విద్యనభ్యసించాలని పరితపిస్తున్నారు. ఇందులో భాగంగానే నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేశారు. కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పించి ఆకట్టుకుంటున్నారు. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- నాడు-నేడుతో సరస్వతీ నిలయాలకు మహర్దశ
- 210 ప్రభుత్వ పాఠశాలలకు ఆధునిక సౌకర్యాలు
- చంద్రగిరి నియోజకవర్గంలో రూ.22.89 కోట్లతో అభివృద్ధి పనులు
- అందుబాటులోకి సాంకేతిక విద్య
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో 210 పాఠశాలల్లో రూ.21.89 కోట్లతో అధునాతన తరగతి గదులతో పాటు, సకల సౌకర్యాలను కల్పించారు. విద్యార్థులకు యూనిఫాం, షూ, బెల్టు, బ్యాగు వంటి వాటితో మెరుగైన సౌకర్యాలు సమకూర్చారు. బ్లాక్ బోర్డుల స్థానంలో డిజిటల్ బోర్డులు, వాటితో పాటు ఐఎఫ్‌బీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్యానెల్) బోర్డులు, పుస్తకాలు చదివి పరీక్షలు రాసే విధానానికి మార్పులు చేస్తూ బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆధునిక సౌకర్యాలతో బాలురు, బాలికలకు, బోధన సిబ్బందికి విడివిడిగా మలమూత్ర విసర్జనశాలలు ఏర్పాటు చేశారు. డిజిటల్ తరగతి గదులు, కంప్యూటర్ క్లాసులు, పోషకాలతో కూడిన రాగిజావ, చిక్కీ, కోడిగుడ్డు పంపిణీ చేస్తున్నారు. తల్లుల ఖాతాలో అమ్మఒడి పేరుతో రూ.15 వేల ఆర్థిక సాయం, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమంగా రాణించే విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పేరుతో ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నారు. నూతన జాతీయ విద్యావిధానంలో సమూల మార్పులతో ఎన్‌సీఈఆర్టీ సిలబస్, మాతృభాషను ఒక సబ్జెక్టుగా అందిస్తూనే ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టడం లాంటివి చేస్తున్నారు.

నాడు-నేడులో మండలాల వారీగా

మండలం పేరు	పాఠశాలల సంఖ్య	నాడు-నేడు	ఖర్చు(రూ.లక్షల్లో)	విద్యార్థుల సంఖ్య	ఉపాధ్యాయుల సంఖ్య
రామచంద్రాపురం	56	31	229.96	2117	158
చంద్రగిరి	66	42	448.42	3912	221
తిరుపతి రూరల్	58	33	630.6	5259	340
పాకాల	69	47	481.68	3330	201
చిన్నగొట్టిగల్లు	40	25	67.26	1355	93
ఎర్రావారిపాలెం	57	32	431.2	2242	136
మొత్తం	346	210	2289.12	18,215	1,149

టీచర్లకు ఫేషియల్ హాజరు

ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటించేందుకు ఫేషియల్ హాజరును ప్రవేశపెట్టారు. ఉపాధ్యాయులకు వృత్యాంతర శిక్షణ ఇప్పించారు. వెనుకబడిన విద్యార్థులకు 'టీచింగ్ అట్ రైట్ లెవల్' కార్యక్రమాన్ని రూపొందించారు. పుస్తకాల మోతను తగ్గించడానికి టర్మ్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. విద్యార్థులు సులభంగా అర్థం చేసుకోవడానికి ఒక పేజీలో ఆంగ్ల మాధ్యమం, మరొక పేజీలో మాతృభాష పాఠాలు రూపొందించారు.

చంద్రగిరి నియోజకవర్గం సమాచారం

మండలాలు	6
మొత్తం పాఠశాలలు	346
నాడు-నేడుతో ఆధునీకరించిన పాఠశాలలు	210
చేసిన ఖర్చు	రూ.2289.12 లక్షలు
ఉపాధ్యాయుల సంఖ్య	1,149
విద్యార్థుల సంఖ్య	18,215

చాలా హ్యాపీ



సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల పట్ల ముఖ్యమంత్రి ఆసక్తి చూపడం చాలా సంతోషంగా ఉంది. నాణ్యమైన చదువును పేదలకు అందించాలనే సీఎం జగన్ తపనకు నిజంగా హ్యాట్సాప్. స్కూల్స్‌లో ఇటువంటి విప్లవాత్మక మార్పులను గతంలో ఎన్నడూ చూడలేదు. టీచర్లు కూడా చాలా హ్యాపీగా ఉన్నారు.

– రాజయ్య, ప్రధానోపాధ్యాయుడు, నెల్లుట్లవారిపల్లె, చిన్నగొట్టిగల్లు మండలం



నాడు: గతంలో అధ్వానంగా పాఠశాల ఆవరణం



నేడు: అందంగా..ఆహ్లాదకరంగా..



నాడు: గతంలో టాయ్‌లెట్ల దుస్థితి



నేడు: సిద్ధమైన టాయ్‌లెట్లు

కార్పొరేట్‌కు దీటుగా..



నాడు మా పాఠశాలలో బల్లలు, ప్రహరీ గోడ, ఇంగ్లిష్ మీడియం చదువులు ఉండేవి కావు. మరుగుదొడ్ల నిర్వహణ కష్టంగా ఉండేది. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మా బడిలో ఆధునిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసి వాటి నిర్వహణకు ఆయాలను అందుబాటులో ఉంచారు. లిక్విడ్లు అందిస్తున్నారు. దీనికి తోడు ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టి అందులో పట్టు సాధించడానికి టోఫెల్ తరగతులను నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు సౌకర్యవంతంగా బల్లలు, సురక్షితమైన తాగునీరు, పాఠశాలకు ప్రహరీగోడ,విద్యార్థులను ఆకర్షించేలా గోడ చిత్రాలతో మా బడి కార్పొరేట్ బడికి దీటుగా తయారైంది.

– జగన్మోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, చిట్టత్తూరు ప్రాథమిక పాఠశాల, ఆర్సీపురం

రూపురేఖలే మారాయి



మాది చాలా చిన్న పాఠశాల. నేను ఒకటో తరగతి నుంచి ఇక్కడే చదువుకుంటున్నాను. మా నాన్నకు పక్షవాతం రావడంతో మా అమ్మ కూలి పనులు చేసుకుని మమ్మల్ని ప్రభుత్వ బడిలో చదివిస్తోంది. అయితే గతంలో మా స్కూల్లో వసతులు ఉండేవి కావు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత నాడు–నేడు కింద మా పాఠశాలను ఎంతో అభివృద్ధి చేశారు. పాఠశాలలో గ్రానైట్, పెయింటింగు, బల్లలతో చాలా చక్కగా తీర్చిదిద్దారు. మాకోసం ఇంత చేస్తున్న సీఎం జగన్‌మామకు ధన్యవాదాలు.

– గురుసాయి, ఐదో తరగతి, కొటాల

మెరుగైన బోధన



కార్పొరేట్ స్థాయిలో ఏ విధంగా అయితే ఉపాధ్యాయులు విద్యార్థులకు శిక్షణ ఇస్తారో అదే తరహాలో నేడు ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ ఇస్తున్నాము. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇద్దరు పిల్లలనీ మా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నాము. నా భర్త స్వతహాగా బట్టలు ఐరన్ చేసుకుంటూ మమ్మల్ని పోషిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌హన్ రెడ్డి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా ఆధునీకరించారు. పిల్లలకు మౌలిక సదుపాయాలు కల్పించారు. అమ్మఒడి పథకం కింద ప్రతి ఏడాదీ మాలాంటి తల్లుల ఖాతాలో రూ.15 వేలు వేస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– శశికళ, చంద్రగిరి

జగన్ మామే గుర్తుకొస్తున్నారు



బూట్లు, యూనిఫాం వేసుకుని బడికి వస్తుంటే భలే ఉంది. ప్రతిసారీ జగన్ మామే గుర్తుకువస్తున్నారు. గతంలో అయితే తరగతిలో కొంతమందికి యూనిఫామ్‌ని అందజేసి మరికొంతమందికి ఇచ్చేవాళ్లు కాదు. అలాంటి సందర్భాలతో పోల్చుకుంటే ప్రస్తుతం మెరుగ్గా నాణ్యమైన యూనిఫాం అందజేశారు. అంతేకాకుండా పాఠశాలలో అనేక రకాల మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. అందమైన రంగులు, సౌకర్యాలతో మా బడి నిజంగా గుడిలా ఉంది.

– ఏ.సాత్విక, 5వ తరగతి, ఎన్వీఎన్ స్కూల్, పాకాల

మనసు హత్తుకునేలా..



గతంలో బ్లాక్‌బోర్డు వరకే పరిమితమై ఉండేది. ఇప్పుడు ఐఎఫ్‌బీ(ఇంటరాక్టివ్ ఫ్యానెల్ బోర్డులు), ట్యాబ్‌లు, స్మార్ట్ టీవీలందించడంతో పిల్లలు ఉత్సాహంగా వింటున్నారు. దృశ్యాలతో బోధన మరింత ఆకట్టుకుంటోంది. ట్యాబ్‌ల్లోని బైజూస్ కంటెంట్‌తో పిల్లలు ఇంటి వద్ద కూడా బోధనపై దృష్టి సారిస్తున్నారు. సీబీఎస్సీ సిలబస్ అందుబాటులోకి వచ్చి ప్రపంచస్థాయి పోటీ పరీక్షల్లో కూడా రాణించే అవకాశం ఏర్పడింది.

– ఐఎఫ్‌బీ బోర్డు ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయులు వాసు, కుప్పంబాదూరు

ఉన్నత విద్యకు 'దీవెన'




విద్యాదీవెన మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్సీ,బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారులు

- కలెక్టరేట్‌లో 4వ విడత విద్యాదీవెన కార్యక్రమం
- జిల్లాలో 35,248 మంది విద్యార్థులకు లబ్ధి
- ఉమ్మడి ఖాతాలోకి రూ.25.79 కోట్లు జమ


తిరుపతి అర్బన్: విద్యతోనే ప్రగతి సాధ్యమని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం భీమవరం నుంచి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యాదీవెన కార్యక్రమాన్ని ప్రారంభించగా.. అదే సమయంలో కలెక్టరేట్‌లో ఈ ఏడాదికి సంబంధించి 4వ విడత విద్యాదీవెన కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారులతోపాటు లబ్ధిదారులు హాజరై ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని, పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని సూచించారు. జిల్లాలో ఈ ఏడాదికి సంబంధించి 4వ విడత విద్యాదీవెనలో 35,248 మంది విద్యార్థులకు మొత్తం రూ.25.78 కోట్లు తల్లుల ఖాతాల్లో జమచేసినట్టు తెలిపారు. పేదరికంతో ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్నారు. అనంతరం విద్యాదీవెన మెగా చెక్కును విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నైయ్య, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ జిల్లా ట్రైనీ అధికారి శశాంక్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాదీవెన ఓ వరం



నేను తిరుపతిలోని ఎస్‌డీహెచ్‌ఆర్ కళాశాలలో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. మా సొంత గ్రామం మదనపల్లి. మా నాన్న వ్యవసాయం చేసుకుంటూ నన్ను చదివిస్తున్నారు. ఆయన ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సందర్భంలో నేను జగనన్న విద్యా దీవెన పథకం పొందాను. దాంతో నేను బాగా చదువుకోగలుగుతున్నాను. చాలా సంతోషంగా ఉంది. – అనిత

ఎంతో ప్రయోజనం



నేను తిరుపతిలోని ఎస్‌డీహెచ్‌ఆర్ కాలేజ్‌లో బీసీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. నా సొంత గ్రామం సోమల. నేను డిగ్రీ చదువుకోడానికి తిరుపతి బీసీ హాస్టల్లో ఉంటున్నాను. మాది చాలా నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ నన్ను చదివిస్తున్నారు. నేను జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా డిగ్రీ పూర్తి చేసుకోగలుగుతున్నాను. సీఎం జగన్ సర్‌కి ధన్యవాదాలు. –సుభాషిణి

కరువుకు శాశ్వత విముక్తి

- సీఎం జగన్‌పై కుట్రలను ప్రజలే తిప్పి కొడతారు
- ఏఎంసీ పాలక మండలి ప్రమాణ స్వీకారంలో మంత్రి కాకాణి



కాదలూరులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి, ఎమ్మెల్యే కిలివేటి



ఏఎంసీ నూతన చైర్మన్, సభ్యులతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే కిలివేటి, నాయకులు

తడ: పాలకుల గుణాన్నిబట్టి ప్రకృతి కూడా స్పందిస్తుందనేందుకు టీడీపీ అధినేత బాబు, సీఎం జగన్ పాలనే నిదర్శనమని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సూళ్లూరుపేట వ్యవసాయ మార్కెటింగ్ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కొండూరు మార్కెట్ కమిటీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌గా పర్వతరెడ్డి కవిత, వైస్ చైర్మన్‌గా నాగరాజారెడ్డి, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న ప్రతిసారీ తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డ తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవం ఏర్పాటు చేసిన రోజున అనూహ్య రీతిలో మండు వేసవిలో కుండపోత వర్షం కురిసిందని గుర్తుచేశారు. ప్రతి ఏటా సమయానికి వానలు రావడం, పంటలు సుభిక్షంగా పండడం అందరూ చూస్తూనే ఉన్నారన్నారు. అంతేగాకుండా గతంలో పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకుండా, నాణ్యత లేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో రైతులు పడ్డ ఇబ్బందులు ఎప్పటికీ మరువలేమన్నారు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక రచ్చబండల దగ్గర కూర్చుని నిట్టూర్చుతూ కాలం వెళ్లదీసేవారన్నారు. నేడు తమ గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తు నుంచి విక్రయం దాకా ప్రతి విషయంలోనూ సలహాలు ఇచ్చే శాస్త్ర వేత్తలను అందుబాటులో ఉంచడం సీఎం జగన్‌కే చెల్లిందని తెలిపారు. మార్కెటింగ్ కమిటీ పేరుకు రాజకీయ పదవే అయినా రైతుసేవకే ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇటీవల టమాటా ధర కిలో రూ.200 దాటినా రైతులకు ఇబ్బంది లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని గుర్తుచేశారు. మదనపల్లెలో రైతుల వద్ద కిలో రూ.234కు కొనుగోలు చేసి ప్రజలకు రూ.50కే అందించినట్టు తెలిపారు. గతంలో పంట నష్టం కలిగితే నష్టాలు పూడ్చుకునేందుకు ఇన్సూరెన్స్ కంపెనీలతో లాలూచీపడి కొందరికి మాత్రమే ప్రయోజనం కలిగేదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం వాటాను పంట బీమా రూపంలో రైతులకు అందిస్తున్నట్టు తెలిపారు. కర్నూలు, కడప వంటి కేంద్ర సహకార బ్యాంకులు నేడు లాభాల బాటలో పయనిస్తున్నాయన్నారు. అంతకముందు కాదలూరు గ్రామంలో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే భవనాలను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవయ్య, ఎన్‌డీసీసీ బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, జెడ్పీటీసీ ఇందుమతి కార్తిక్, నాయకులు ఎంపీ కృష్ణారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, రాజారెడ్డి, రఘురెడ్డి, ధనలక్ష్మి, ఆర్ముగం, సుందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

నేడు కోడె దూడల వేలం

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీలో శనివారం 11 కోడె దూడలు, రెండు ఆవులను వేలం ద్వారా విక్రయించనున్నట్టు లైవ్‌స్టాక్ ఫారమ్ విభాగాధిపతి డాక్టర్ ఎంవీఏఎన్.సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల రైతులు శనివారం ఉదయం 9గంటలకు వర్సిటీ ఆవరణలోని లైవ్‌స్టాక్ ఫారమ్ కాంప్లెక్స్ వద్దకు చేరుకొని వేలం ప్రక్రియలో పాల్గొనవచ్చని తెలిపారు. మంచి జాతి కోడెదూడలను విక్రయిస్తున్నామని, ఇవి ప్రత్యేకంగా పునరుత్పత్తికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఔత్సాహిక రైతులు ధరావత్తుగా రూ.2 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆయన సూచించారు.

చంద్రగిరిలో టీడీపీ దిగజారుడు రాజకీయం

- పాత పచ్చ బ్యాచ్‌తో ఫ్రెష్ జాయినింగ్‌లు
- నవ్వులపాలైన పులివర్తి నాని తనయుడు

తిరుపతి రూరల్: చంద్రగిరిలో టీడీపీ నేతలు దిగజారుడు రాజకీయాలకు తెరదీస్తున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని టీడీపీలో యువనేతగా చెప్పుకునే పార్టీ ఇన్‌చార్జ్ కుమారుడు దొడ్డిదారి రాజకీయాలకు తెరదీస్తున్నారు. వలసలను కొంతైనా అడ్డుకోవాలనే దురుద్దేశంతో అడ్డదారులు తొక్కుతున్నారు. దానికి నిదర్శనమే చిన్నగొట్టిగల్లు మండలం, ఎగవూరులో ఎప్పటి నుంచో టీడీపీలోనే ఉన్న నాయకులు, కార్యకర్తలను మరలా ఫ్రెష్‌గా టీడీపీలో చేరుతున్నట్లు, వారు అందరూ వైఎస్సార్‌సీపీ నేతలు అంటూ పెద్ద డ్రామానే ఆడారు. అందులో భాగంగా శుక్రవారం పాతకండువాలను తీసి, కొత్తగా పచ్చ కండువాలను మెడలో వేసి ఆ కుర్ర నేత పెద్ద ఫోజులే ఇచ్చాడు. ఆ ఫొటోలు బయటకు రావడంతో సోషల్ మీడియాలో పచ్చ పార్టీ నేతలే ఆశ్చర్యపోయారు. టీడీపీ నేతలకే మళ్లీ టీడీపీ కండువాలు వేయడం ఏమిటీ అంటూ ప్రశ్నలు గుప్పించారు.

వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న వలసలు

- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



పాకాలలో పార్టీలో చేరిన వారితో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



చిన్నగొట్టిగల్లు: వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ కొనసాగుతోంది. పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేదలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలతో పాటు గ్రామ గ్రామాన చేస్తున్న అభివృద్ధిని పార్టీలకు అతీతంగా అభినందిస్తున్నారు. చాలా గ్రామాల్లో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. అందులో భాగంగా చిన్నగొట్టిగల్లు మండలం, జంగావాండ్లపల్లి పంచాయతీ పరిధిలోని కురవపల్లికి చెందిన టీడీపీ సానుభూతిపరులు వైఎస్‌ఆర్సీపీలో చేరారు. జంగావాండ్లపల్లి నుంచి తుమ్మలగుంటకు వచ్చిన టీడీపీ సానుభూతి పరులకు శుక్రవారం పార్టీ కండువాలు కప్పి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వారిని వైఎస్సార్సీపీలోకి ఆహ్వానించారు. కురవపల్లిలో 12 కుటుంబాలు వైసీపీలో చేరడంతో గ్రామం మొత్తం వైసీపీకి సానుకూలంగా మారింది. ప్రజలను అక్కున చేర్చుకునే నాయకుడు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అని వారు కొనియాడారు. ఆయన తనయుడిగా తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి మద్దతుగా నిలుస్తామని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ సహదేవరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారిలో వెంకట్రాము, మనోహర, ఆనంద, శంకరయ్య, నాగ రాజమ్మ, రామచంద్రయ్య, సుబ్రమణ్యం, చంద్రయ్య, వెంకట్రామయ్య, రామచంద్రయ్య, నాగరాజ, ఆవుల కృష్ణమ్మ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ సానుభూతిపరులు

పాకాల: మండలంలోని పత్తిపాటివారిపల్లె దళితవాడకు చెందిన టీడీపీ సానుభూతి పరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం గడపగడపకు మహాపాదయాత్ర కార్యక్రమంలో భాగంగా తమ గ్రామానికి వచ్చిన తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ విధివిధానాలు నచ్చి, కుల, మత తారతమ్యాలు లేకుండా చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీపై ఆకర్షితులైనట్లు గ్రామానికి చెందిన 20 కుటుంబాల ప్రజలు పేర్కొన్నారు. ఇంత కాలం హక్కులను హరించేలా పత్తిపాటివారిపల్లె గ్రామానికి చెందిన అగ్రకులాల నాయకులు వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, తుడా చైర్మన్ అన్ని సమయాల్లో తమకు అండగా నిలుస్తున్నారని, మోహిత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలతో హోరెత్తించారు. ఏ అవసరం వచ్చినా అండగా ఉంటామని మోహిత్ రెడ్డి వారికి భరోసా కల్పించి, పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీటీసీ సభ్యురాలు గౌతమి వినాయక ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారిలో బాబుప్రసాద్, అనిల్‌కుమార్, శ్రీకాంత్, వెంకయ్య, గోపాలయ్య, శివకుమార్, బానుప్రకాష్, రమేష్, బండ్లప్రసాద హరిబాబు, అంకయ్య, కవిత, భారతి, అనసూయ, బేబి, రెడ్మెమ్మ, లావణ్య తదితరులు ఉన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్‌ఐ జిలానీ తన సిబ్బందితో కొత్తవీరాపురంలోని ఓ దుకాణం వద్ద మద్యం బాటిళ్లతో నిలబడి ఉన్న వ్యక్తిని వెంబడించగా బాటిళ్లను దుకాణంలో ఉంచి పరారయ్యేందుకు ప్రయత్నించినట్టు వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు వెంబడించి అతన్ని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వ్యక్తి కొత్తవీరాపురం గ్రామానికి చెందిన గాండ్ల శ్రీనివాసులుగా గుర్తించి అతని వద్ద నుంచి 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

లారీ ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన వెంకటేష్

నాయుడుపేట టౌన్: పట్టణంలోని చంద్రబాబు కాలనీ సమీపంలో రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున లారీ ఢీకొన్న ప్రమాదంలో అదే ప్రాంతానికి చెందిన సగుటూరు వెంకటేష్(24) మృత్యువాత పడ్డాడు. పోలీసుల కథనం.. పట్టణంలోని చంద్రబాబు కాలనీకి చెందిన వెంకటేష్ లారీ క్లీనర్. గురువారం అర్ధరాత్రి ఇంటి నుంచి కాలనీ సమీపంలో ఉన్న రహదారిపైకి వచ్చాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ అతనిని ఢీకొనడంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తండ్రి సగుటూరు రఘు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. రఘు మనుమడు అనారోగ్యంతో వారం క్రితమే మృతిచెందాడు. అంతలోనే కొడుకు మృతిచెందడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

టీడీపీ నాయకులపై అట్రాసిటీ కేసు

ఏర్పేడు: మండలంలోని ఆరుగురు టీడీపీ నాయకులపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శుక్రవారం రాత్రి తెలిపారు. ఆయన కథనం.. వికృతమాల దళితవాడకు చెందిన ఐతేపల్లి గురునాథం సెప్టెంబర్ 12న ఉదయం 10 గంటలకు తమ ట్రాక్టర్‌లో రేణిగుంట నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యం వికృతమాల సమీపంలో టీసీఎల్ కంపెనీ వద్ద మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా పలువురు టీడీపీ నాయకులు ధర్నా చేస్తున్నారు. ట్రాక్టర్ అక్కడకు చేరుకోగానే టీడీపీ మాజీ జెడ్పీటీసీ పేరం ధనుంజయులునాయుడు, మరో ఐదుగురు కలిసి గురునాథంను కిందికి లాగి కులం పేరుతో దూషించి దాడిచేసి గాయపరిచారు. అప్పట్లో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణానంతరం ధనుంజయులు నాయుడుతోపాటు మరో ఐదుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

క్రీడలతో మానసికోల్లాసం

- అంతర కళాశాలల క్రికెట్ పోటీలు ప్రారంభం

గూడూరు రూరల్: గూడూరులోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు రోజులపాటు జరగనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అంతర కళాశాలల క్రికెట్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూఆర్‌పీ టీసీఎస్ హెడ్ సప్తగిరి చాపలపల్లి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విక్రమ సింహపురి యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అంతర కళాశాలల క్రికెట్ పోటీలు మూడు రోజులపాటు జరుగుతాయన్నారు. విద్యార్థులు క్రీడలతోపాటు చదువులోనూ రాణించాలన్నారు. అనంతరం జరిగిన ప్రారంభ మ్యాచ్‌లో ఎస్.కె.ఆర్.– స్వర్ణాంధ్ర భారతి జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఎస్.కె.ఆర్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన స్వర్ణాంధ్ర భారతి జట్టు 83 పరుగులకే ఆలౌటైంది. మరో మ్యాచ్‌లో నాయుడుపేట డిగ్రీ కళాశాల, గూడూరు శ్రీనివాస డిగ్రీ కళాశాల జట్లు తలపడగా.. నాయుడుపేట జట్టు 69 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన శ్రీనివాస డిగ్రీ కళాశాల జట్టు 7 వికెట్లు కోల్పోయి 70 పరుగులు చేసి విజయం సాధించింది. అధ్యాపకులు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసులు, వ్యాయామ అధ్యాపకులు నారాయణరాజు పాల్గొన్నారు.



మనో బలం.. మా ఆయుధం

జీవికి చూపు ప్రధాన బలం. ఆ చూపే లేకుంటే జగత్తే అయోమయం. కానీ ఎస్వీ ఆర్ట్ కళాశాల మైదానంలో లూయీ బ్రెయిలీ జయంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన క్రీడాపోటీల్లో విభిన్న ప్రతిభావంతులు పోటీపడి ఆశ్చర్యపరిచారు. రన్నింగ్, హాకీ, చెస్, క్యారమ్స్, చిత్రలేఖనం తదితర పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి చూపరులను అబ్బురపరిచారు. 'మనో బలం మా ఆయుధం.. చూపులేకపోయినా బతికేస్తాం' అని చాటిచెప్పారు. ఆ దృశ్యాలు 'సాక్షి' క్లిక్ మనిపించింది. – మహ్మద్ రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, తిరుపతి

చోరీ కేసులు కొట్టివేత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసులను శ్రీకాళహస్తి న్యాయస్థానం కొట్టివేసింది. పోలీసుల కథనం.. మాస్ బార్ పక్కన ఉన్న చిల్లర దుకాణంలో చోరీ, స్కిట్‌బ్రాంచ్ స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియాకు సంబంధించిన ఏటీఎంలో చోరీ చేశారన్న ఆరోపణలతో తంగరాజు హరి అలియాస్ హరివలగల్, జర్రిపోతు నాగరాజు, శేఖర్ శివరాజ్, మీర్జావలిని అరెస్టు చేసి జైలుకు పంపారు. ముద్దాయిల తరఫున ప్రముఖ క్రిమినల్ డిఫెన్స్ లాయర్ విప్పరపల్లి సాయిరాం వాదనలు వినిపించారు. వీటితో ఏకీభవించిన న్యాయమూర్తి కృష్ణప్రియ రెండు కేసుల్లో ముద్దాయిలను నిర్దోషులుగా తీర్మానిస్తూ కేసులను కొట్టివేశారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ పోటీలు ప్రారంభం

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడల్లో భాగంగా తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో రాష్ట్రస్థాయి అండర్–14, 17 రోల్‌బాల్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 8 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులకు పతకం, షీల్డు ఇవ్వడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఎస్‌జీఎఫ్ యూ–14 జిల్లా కార్యదర్శి విజయకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సంయుక్త కార్యదర్శి బాబు, పీడీలు శ్రీధర్, శ్రీమన్నారాయణరెడ్డి, సోమశేఖర్, శోభన్ బాబు, ప్రసన్నకుమారి, సుధారాణి, సునిల్‌కుమార్, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

తగ్గిన నేరాలు.. పెరిగిన రికవరీలు

- వార్షిక నేరాల సమీక్షలో ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైమ్: 'గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది నేరాల శాతం తగ్గింది. రికవరీల శాతం పెరిగింది' అని జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 2023 వార్షిక నేరాల నివేదికపై ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎన్నో సంచలనాత్మక కేసులను ఛేదించి బాధ్యతలకు న్యాయం చేశామన్నారు. ఎప్పుడూ లేనంతగా దొంగతనాలలో రికవరీ శాతం పెంచామన్నారు. ఫోక్సో కేసుల్లో బాధితులకు శిక్షపడే వరకు మానిటరింగ్ చేసి శిక్ష వేయించినట్టు తెలిపారు. ఒడిశా సరిహద్దుల నుంచి శ్రీలంక దేశానికి అక్రమంగా తరలిస్తున్న గంజాయి కేసును సమర్థవంతంగా ఛేదించినట్టు గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన దిశా యాప్ ప్రజల్లోకి తీసుకెళ్లి 40,835 మంది రిజిస్ట్రేషన్ చేసుకునేలా అవగాహన కల్పించామన్నారు. 2022లో 773 కేసులు నమోదు కాక 2023లో 625 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

- 'జిల్లా వ్యాప్తంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా 937 ఫిర్యాదులందగా అందులో 892 ఫిర్యాదులు పరిష్కారం.
- ఈ ఏడాది 15 శాతం మేరకు నేరాలు తగ్గించాం.
- జిల్లా వ్యాప్తంగా 1,33,527 వాహనాలు తనిఖీ చేయగా, పాపిలాన్ డివైస్ ద్వారా 2,156 మంది పాత నేరస్తులను పట్టుకున్నాం.
- దేహ సంబంధిత నేరాలలో 2022లో 710, 2023లో 687 నేరాలు జరిగాయి. గత ఏడాది 55 హత్యలు జరగగా ఈ ఏడాది 37 హత్యలు జరిగాయి.
- బందిపోటు నేరాలకు సంబంధించి గత ఏడాది ఐదు కేసులు, ఈ ఏడాది ఒక కేసు నమోదైంది. రాత్రిపూట ఇంటి దొంగతనాలు గత ఏడాది 25 కాగా ఈ సారి 196 నమోదయ్యాయి.
- సైబర్ నేరగాళ్లు కోటి 11 లక్షలు దోచుకోగా అందులో రూ.73 లక్షలు రికవరీ చేశాం. అలాగే రూ.3.15 కోట్ల విలువ చేసే 1,750 సెల్ ఫోన్లను రికవరా చేసి బాధితులకు అందించాం.
- 105 గంజాయి కేసుల్లో 416 మందిని అరెస్ట్ చేసి రూ.1.63 కోట్ల విలువ చేసే 1,220 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. ఎర్రచందనం అక్రమ రవాణాలో 15 కేసులు నమోదు చేసి 76 మందిని అరెస్ట్ చేశాం. అలాగే రూ.9.75 కోట్ల విలువచేసే 16,000కిలోల ఎర్రచందనం దుంగలు, 34 వాహనాలను స్వాదీనం చేసుకన్నాం.
- గత ఏడాదితో పోలిస్తే ఈసారి రికవరీ రేటు ఆరు శాతం మేరకు పెరిగింది. 2022లో 66 శాతం ఉండగా.. 2023లో 72 శాతం వరకు వచ్చింది. రూ.12.01 కోట్ల సొత్తు దొంగతనానికి గురవ్వగా అందులో రూ.8.61 కోట్లు రికవరీ చేశాం.
- మోటార్ వెహికల్ యాక్ట్ కేసుల్లో 94,2504 కేసులు నమోదు చేసి రూ.4.16 కోట్ల జరిమానా విధించాం. ఇంటర్ సెక్టార్ వెహికల్ ద్వారా 15,695 కేసులు నమోదు చేసి రూ.1.62 కోట్ల మేర జరిమానా విధించాం. 2,541 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 1,607 హౌస్ న్యూస్ కేసులు నమోదు చేసి కోర్టు ద్వారా శిక్ష పడేలా చేశాం' అని ఎస్పీ తెలిపారు.